# ఎక్కవలసిన రైలు

## – సత్యం మందపాటి



"సాహితీ సిరికోన" వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జొన్నలగడ్డ రాంభొట్లు- సరోజమ్మ స్మారక పురస్కారం" బహుమతి అందుకున్న నవల.

*(గత సంచిక తరువాయి)*

**ఫోన్ షాపులో** పనులన్నీ అయిపోయాక, మిగతా షాపుల్లో రేఖకి సుమకి కావలసినవి కొన్నారు.

"పొరపాటున కూడా నువ్వెక్కడున్నదీ అతనికి తెలియనీయకు" అంటున్నప్పుడే వేణు ఫోన్ మ్రోగింది.

లాసేంజలెస్ నించి ప్రకాష్.

"వేణూ, రేఖ రాజేశ్వరి వాళ్ళు మీ ఇంటికి వచ్చేశారా. ఏమయింది?" అడిగాడు ప్రకాష్.

అప్పటిదాకా జరిగినవన్నీ చెప్పాడు వేణు.

"అంత పనిచేశాడా దరిద్రుడు? రేపు ప్రొద్దున్నే బాంక్ తెరిచే సమయానికి వెళ్ళి డబ్బులు తీసేసుకోండి. నేను పది వేల డాలర్లు పంపిస్తాను. అవసరానికి వాడుకోమను. ఇంకా కావాలంటే మన మిత్రుల దగ్గర రైజ్ చేద్దాం. నాకు రాజేశ్వరి, రేఖ పూర్తిగా చెప్పలేదుగానీ, కొంతవరకూ చెప్పారు. ఇటువంటి ఘోరం నేనెన్నడూ వినలేదు. రేపు మళ్ళీ పిలుస్తాను. రేఖతో కలిసి మాట్లాడి ఏం చేద్దామో, ఎలా చేద్దామో ఆలోచిద్దాం" అన్నాడు ప్రకాష్. అని ఫోన్ పెట్టేశాడు.

ఇంటికి వచ్చి వీణ చేసిన బజ్జీలు తింటూ, కాఫీ త్రాగుతూ రాజేశ్వరి ఇందాక ఆపేసిన కథ, ఇప్పుడు రేఖ చెబుతుంటే వింటున్నారు వేణు, వీణ.

"నేను ఇక్కడికి అంటే అమెరికాకి వచ్చి ఒక నెల తక్కువగా రెండేళ్ళయింది. వెంటనే ఒక నెల రోజుల్లో ఉద్యోగం కూడా వచ్చింది. అప్పుడే అతని నిజ స్వరూపం బయటపడింది. సూర్యంగారు, అంటే నా మామగారు అమెరికా వచ్చి నలభై ఏళ్ళు దాటిందేమో. మొద్దట్లో కొన్నాళ్ళు ఏదో ఉద్యోగం చేసినా, తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారంలో దిగి విపరీతంగా సంపాదించాడు. వాసు ఏదో డిగ్రీ చేశాడుగానీ, ఎక్కడా ఉద్యోగం చేయడు. చచ్చేంత ఆస్థి వుంది కదా మరి.

ఒక్కడే కొడుకు. మా పెళ్ళికి ముందు ఇండియాలో వాసు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు అని చెప్పారుగానీ, ఇక్కడికి వచ్చాకే తెలిసింది అతనేమీ చేయడు, చేయటం చేతకాదు అని. నేను ఉద్యోగం చేస్తే జీతం వస్తుంది కాబట్టి అది ఫరవాలేదు. కానీ నాకు ఎక్కడ ఫైనాన్షియల్ ఇండిపెన్డెన్స్ వస్తుందో అని అతని భయం. అతను నన్ను కంట్రోల్ చేయాలిగదా మరి. అందుకే నా బాంక్ ఎకౌంట్, క్రెడిట్ కార్డు, నేను వాయిదాల మీద కొనుక్కున్న కారు, నా నగలు అన్నీ అతని కంట్రోల్లోనే వున్నాయి. అతనే నన్ను మా ఆఫీసులో దించి, మళ్ళీ సాయంత్రం తీసుకువెడతాడు. నా కారే అయినా, అన్ని ఎకౌంట్స్ లాగానే, అది కూడా అతనితో కలిపి జాయంట్ ఎకౌంటులోనే వుంది వారానికి ఇరవై డాలర్లు నాకు ఇస్తాడు, 'వాడుకోమని'. ఇంతవరకూ ఈ రెండేళ్ళల్లో మేమిద్దరం కలిసి ఒక్క సినిమాకి కూడా వెళ్ళలేదు. ఒక్కసారి కూడా బయట రెస్టారెంట్లలో తినటానికి వెళ్ళలేదు. నేను చెబుతున్నది నాకు సినిమాల మీద ప్రేమా, రెస్టారెంట్ల మీదా ప్రేమ ఎంతవుందో చెప్పటానికి కాదు. కొత్తగా పెళ్ళి చేసుకుని తెచ్చుకున్న భార్య మీద అతనికి ఎంత ప్రేమ లేదో చెప్పటానికి!" చెప్పటం ఆపి రేఖ కళ్ళు తుడుచుకుంది.

కొత్తగా పెళ్ళి చేసుకుని వచ్చిన భార్యతో అలా వుంటున్నాడంటే నమ్మశక్యం కాకుండా వుంది వీణకు. అసలు ఏమిటి వాసు ఉద్దేశ్యం? ఆమె జీవితమే కాదు, అతని జీవితంలో కూడా గడపవలసిన ఎన్నో మధురమైన రోజులు అలా వృధా చేసుకునేది ఎవరికోసం? ఎందుకోసం? వీణకు అదేం మనస్థత్వమో అంతుబట్టలేదు.

రాజేశ్వరి అన్నది "ఇంట్లో వాసుతో పాటు, అతని అమ్మా, నాన్న కూడా వుంటారు. అలా చెప్పటం కన్నా, పెళ్ళయినా కూడా వాసు భార్యతో తన అమ్మానాన్నల దగ్గరే వుంటాడంటే బాగుంటుందేమో! ఇల్లు ఆ పెద్దాయన పేరుతోనే వుంది. ఆయనకి, వున్న డబ్బు లెఖ్కపెట్టుకోవటం తప్ప వేరే పనేమీ లేదు. షాపులూ, ఇళ్ళూ, ఎపార్ట్మెంట్లూ ఎన్నో వున్నాయి. అద్దెల మీదే ఎంతో వస్తుంది. ఆయనకి అవి మేనేజ్ చేయటానికి ఆఫీసు, కొంతమంది ఉద్యోగులు కూడా వున్నారు. ఎప్పుడూ ఇంట్లోనే వుండి ఫోన్ మీద బిజినెస్ నడిపిస్తుంటాడు. ఆయన వూళ్ళో మహారాజు, ఆవిడ ఆ ఇంట్లో మహారాణి. కనుక ఇంట్లో అందరూ మహారాణిగారి మాటే వినాలి. బిజినెస్సులో తప్ప, మిగతా అన్ని విషయాల్లోనూ సూర్యంగారు ఆవిడ మాటలేవీ జవదాటడు. కొడుకుని పూర్తిగా తనకి నకలుగానే పెంచుతున్నది ఆవిడ"

వేణు శ్రద్ధగా వింటున్నాడు.

"ఆవిడకి అవసరమైనప్పుడు తప్ప, మిగతా సమయాల్లో నడుం వంగదు. ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు తప్ప వంట చేయదు. చిరుతిళ్ళకు ఎక్కువ అలవాటు పడిపోయారు. ఇండియన్ వంటలే కావాలని లేదు. ఏదయినా ఫరవాలేదు. ఫ్రిడ్జిలో ఏది వుంటే అదే తింటారు. లేదా బ్రెడ్, బయటనించీ తెప్పించే పిజ్జాలు, టాకోలు, చైనీస్ ఫుడ్. ఎక్కడ వదిలేసిన ఫుడ్ అక్కడే వుంటుంది. ఎప్పుడైనా అవి తినగలంగానీ రోజూ అవే, ఫ్రిడ్జిలోనించీ తీసి, వేడి చేసుకు తినాలంటే చాల కష్టం. నేనూ, రేఖా పూర్తిగా మన వంటలు తిని పెరిగిన వాళ్ళం. జీవితకాలం అంతా అదే ఆహారం అలవాటు అయిన వాళ్ళం.

భోజనాల సమయం అయింది అంటేనే వెగటుగా వుండేది. బాలింతరాలుకి ఎన్నో చేసిపెట్టాలని నేను అనుకునే దాన్ని. నిస్సహాయంగా నిట్టూర్చటం తప్ప ఏంచేస్తాం? తప్పదు మరి!"

రేఖ చెప్పింది. "నేను వచ్చాక అటు ఆఫీసు పని, ఇటు ఇంటెడు చాకిరి. పనమ్మాయిని పెట్టుకునే స్థోమత వుందిగానీ, నేనున్నానుగా అని ఆ అవసరం లేకుండా పోయింది. అసలు ఆవిడ పోలికే వాసుకి వచ్చిందేమో అనిపిస్తుంది. ఇద్దరిదీ ఒకే రకమైన సాడిస్ట్ మెంటాలిటీనే. నేను కష్టపడుతుంటే వాళ్ళకి ఆనందం. నేనెక్కడ సుఖపడతానో అని భయం. అంతేకాదు, వాళ్ళకి ఎవరూ స్నేహితులు కూడా లేరు. నాకు మా ఆఫీసులో కలిసి పనిచేసే వారిలోనే ఒకళ్ళిద్దరు స్నేహితులయారు. వారితో కూడా పార్టీలు, రాకపోకలు లేవు. ఉండకూడదు. నా మీద వాళ్ళ కంట్రోలు అంత గట్టిగా వుండేది. నేను మా అమ్మా నాన్నలకు ఇండియాకి ఫోన్ చేస్తే, నా పక్కనే వాసుగానీ, మా అత్తగారుగానీ వింటూ నాతోనే కూర్చునేవారు. ఎవరికీ చెప్పుకుని సహాయం అడిగే అవకాశం కూడా లేదు"

వేణికి అది వింటుంటే వాళ్ళ మీద ఒక పక్క అసహ్యం, ఇంకొక పక్క కోపం వస్తున్నాయి. కానీ ఏమీ అనలేదు.

"మీ మామగారి పేరేమిటి? ఎక్కడ వుంటారు?" అని అడిగాడు వేణు.

చెప్పింది రేఖ. "నేనూ ఇక్కడ నలభై ఏళ్లనించీ వుంటున్నాను. ఇక్కడ తెలుగు అసోసియేషన్లో పని చేశాను. మన గుడి కట్టేటప్పుడు కూడా మొదట్లో ఎంతో సహాయం చేశాను. ఎంతమందితోనో కలిసి పనిచేశాను. కానీ ఆయన పేరు ఎప్పుడూ వినలేదు" అన్నాడు వేణు.

"ఆయనకి డబ్బు సంపాదన తప్ప ఇక దేనితోనూ అవసరం లేదు. స్నేహితులు అసలే లేరు. అందుకని మీకు ఆయన తెలిసే అవకాశం లేదు" అంది రేఖ.

"వాసుకి ఒక కజిన్ వున్నాడు, ఈ వూళ్లోనే వాళ్ళ ఇంటికి దగ్గర్లోనే. వాళ్ళిద్దరూ కలిసే డ్రగ్స్ తీసుకుంటుంటారు. బయట అన్నిరకాల తిరుగుళ్ళూ తిరుగుతుంటారు. నా గురించి నా ఎదుటే అసహ్యంగా మాట్లాడుకుంటుంటారు. ఒకటి రెండుసార్లు వాసు చూడకుండా వాళ్ళ మాటలు నా ఫోనులో రికార్డు కూడా చేశాను. నామీద జోకులు వేసుకుంటూ ఎన్నో ఫోన్ మెసేజీలు పంపించుకుంటారు. కొన్నింటిని నాకూ పంపిస్తుంటారు. కొన్ని భరించలేనంత అసభ్యంగా కూడా వుంటాయి. ఒకసారి వాసు బాత్రూములో వున్నప్పుడు, అతని ఫోనులో మెసేజ్ వచ్చిన టింగ్ అనే సౌండ్ వస్తే చూశాను. ఎన్నో నెలలనించీ వాళ్ళిద్దరి మధ్యా జరుగుతున్న ఆ మెసేజీలు చూసి ఒళ్ళు మండిపోయింది. తర్వాత వాసుని అడిగాను 'ఎందుకలా నా గురించి ఇతరులకి అంత అసభ్యంగా వ్రాస్తున్నావని'. 'దాంట్లో తప్పేమిటి?' అంటాడు. 'నేను నీ భార్యని. అలా భార్య గురించి ఎవరికో అలా ఎవరూ వ్రాయరు' అన్నాను. 'వాడు ఎవరో కాదు, నా కజిన్. నా బెస్ట్ ఫ్రెండ్' అన్నాడు. 'వాడూ నేనూ ఒకటే. వేరు కాదు' అన్నాడు. నేను ఇంకా ఏదో అనబోతుంటే కొట్టబోయాడు. ఈ విషయం మా అమ్మకి కూడా చెప్పలేదు, అంత అసభ్యంగా వున్నాయి వాళ్ళ సంభాషణలు" అంది రేఖ.

రేఖ చేతిని తన చేతిలోకి తీసుకుని, ప్రేమగా చూస్తూ సుతిమెత్తంగా వత్తింది వీణ.

“ఇక్కడ జరుగుతున్నవేవీ ఇన్నాళ్ళూ మీ అమ్మా, నాన్నలకు చెప్పలేదా?” అడిగాడు వేణు.

“లేదు. వాళ్ళ అనారోగ్యాలు, జీవిత సమస్యలతో వాళ్ళున్నారు. నా కష్టాలు చెప్పుకుని వాళ్ళని ఇంకా బాధపెట్టటం నాకు ఇష్టం లేక ఇవేమీ చెప్పలేదు”

ఒక్క క్షణం ఆగి అన్నది రేఖ. “నేను కడుపుతో వున్నానని తెలిసి మా అమ్మ డెలివరీకి మూడు నెలలు ముందుగా వస్తానన్నది. ‘మూడు నెలలు ఆవిడ ఇక్కడ వుండి ఏం చేస్తుంది, లేనిపోని ఖర్చు. పది రోజుల ముందు ఒక్కత్తినే రమ్మను’ అంది మా అత్తగారు. అలాగే డెలివరీకి పదిరోజుల ముందు వచ్చింది మా అమ్మ. ఇంటికి వచ్చిన గంటలోపలే అమ్మకి ఇక్కడి పరిస్థితులు అర్థమైపోయాయి”

రాజేశ్వరి అందుకున్నది. “పిల్ల నిండు గర్భిణి కనుక దానికిష్టమైన మంచి పదార్థాలు వండి పెడితే, దాని ఆరోగ్యంతో పాటు పుట్టే పిల్ల ఆరోగ్యం కూడా బాగుంటుందనుకున్నాను. అయినా ఇంట్లో బియ్యం కానీ, పప్పులుగానీ, కూరగాయలుగానీ ఏవీ లేవు. వాళ్ళకి అవేవీ అక్కరలేదు కదా మరి. అందుకే పది రోజులనించీ నాకూ సరైన తిండిలేదు. గుంటూరులో మా ఇల్లు వదిలాక, ఇప్పుడు మీ ఇంట్లోనే మంచి భోజనం, మంచి భోజనమేమిటి, అసలైన మన అన్నం తినటం” అన్నది.

ఆ మాటలు విని వేణు సోఫాలోనించీ లేచి అసహనంగా ఇటూ అటూ తిరగసాగాడు.

అతని ముఖం ఎర్రగా మారింది. తమాయించుకుంటున్నాడు.

“కాన్పు అయేక కూడా అంతే. పసిపిల్లని చూసి ఆనందించటం, చేతుల్లోకి తీసుకుని ప్రేమ చూపించటం పసిపాప తండ్రికీ లేదు, అతని తల్లిదండ్రులకీ లేదు. ఇంటికి వచ్చాక కూడా, పాప నిద్రపోతున్నా వచ్చి ప్రశాంతంగా వున్న ఆ లేత ముఖాన్ని చూడలేదు వాళ్ళు. అదేమిటో, ఎందుకో నాకిప్పటికీ అర్థం కాదు” అంది రాజేశ్వరి.

“నేను వాసుని అడిగాను ‘మన పాప ఎలావుంది?’ అని. ‘బాగానే వుంది’ అని ముక్తసరిగా అని వెళ్ళిపోయాడు. అది అతని మనసులోనించీ వచ్చిన మాట కాదని తెలుస్తూనే వుంది. అతను సుమని ఒక్కసారైన ముద్దు పెట్టుకోవటం, ఎత్తుకుని హృదయానికి హత్తుకోవటం కూడా చూడలేదు” రేఖ అన్నది.

వీణకి కూడా వాళ్ళెందుకు అలా చేస్తున్నారో అర్థం కాలేదు. నెమ్మదిగా అంది. “రేఖా, నువ్వు చాల నెమ్మదస్తురాలివనీ, మంచి పిల్లవనీ తెలుస్తూనే వుంది. అయినా అడుగుతున్నాను. ఏమీ అనుకోకు. నీకూ అతనికీ, లేదా నీకూ నీ అత్తగారికి గొడవలు ఏమైనా వచ్చాయా? కూతురిలా చూసుకోవలసిన కోడలితో ఎందుకలా ప్రవర్తించారో అర్థంకాక అడుగుతున్నాను”

"మీరెందుకు అడిగారో నేను అర్థం చేసుకోగలను ఆంటీ. మామధ్య అలాటివేమీ లేవు. నన్ను ఎంత కష్ట పెట్టినా, బాధించినా నేను ఒక్కసారి కూడా వాళ్ళకి ఎదురు చెప్పి మాట్లాడలేదు. మంచితనంతోనే వాళ్ళ ప్రవర్తనని కొంతయినా మార్చాలనుకున్నాను. వాళ్ళు చెప్పినవన్నీ చేశాను. అయినా వాళ్ళు మారలేదు. అది నన్ను గురించీ, నా ప్రవర్తన గురించీ కాదు, వాళ్ళ తత్వమే అంత అనిపించింది. నా బదులు ఆ స్థానంలో ఎవరు వున్నా అంతేనేమో అనుకుని నేను నోరెత్తలేదు" కళ్ళు తుడుచుకున్నది రేఖ.

ఎవరూ మాట్లాడలేదు.

ఆ నిశ్శబ్దాన్ని భరించలేక వేణు అన్నాడు "అయితే, ఏం చేద్దామో చెప్పు. ఇక్కడ నాకు తెలిసిన ఎవరి చేతయినా చెప్పించి పరిష్కారం చేద్దామా? లేదా కోర్టుకి వెళ్ళి ముందుగా వాళ్ళు నీ దరిదాపుల్లోకి రాకుండా టెంపరరీ ప్రొటెక్షన్ ఆర్డర్, విడాకులు, ఆలిమోనీ మొదలైనవి ప్రయత్నం చేద్దామా? నువ్వెలా చెబితే అలా చేద్దాం. ఏమంటావు? ఆలోచించుకునే చెప్పు"

"నేనింకా కొత్తగా ఆలోచించుకునేదేమీ లేదు అంకుల్. నేను గట్టి నిర్ణయమే తీసుకున్నాను. మీరు చెప్పినవన్నీ చేద్దాం. ఈ దేశంలో లాయర్ ఖర్చులు భరించలేనంతగా వుంటాయని తెలుసు. మా ఆఫీసులో ఈమధ్య ఇలాటి కేసులో కోర్టుకి వెళ్ళింది ఒకమ్మాయి. ఎంతో ఖర్చయినా ఇప్పుడు ఆమె జీవితం ప్రశాంతంగా వుంది. ఆ అమ్మాయిని అడుగుతాను ఆ ప్రాసెస్ ఏమిటో, ఖర్చులెంతవుతాయో" అంది రేఖ.

"సరేనమ్మా. నువ్వు ఏం చేద్దామనుకున్నా అలాగే చేద్దాం. నేనూ, వీణా, ప్రకాష్ నీకు అండగా వుంటాము. ధైర్యంగా వుండు" అన్నాడు వేణు.

"ఇక్కడ జరుగుతున్నది ఇండియాలో మీ నాన్నగారికి చెప్పావా? ఇంకా చెప్పకపోతే ఈరోజు రాత్రే పిలిచి చెప్పు. ఇప్పుడు అక్కడ నిద్రా సమయం" అన్నది వీణ.

"తప్పకుండా చెబుతాను ఆంటీ. ఆయన అభిప్రాయం కూడా కనుక్కుంటాను" అంది రేఖ.

## 5

"బర్మింగ్హాంలో దిగబోతున్నాం" అశోక్ ముఖర్జీ అంటుంటే చటుక్కున మెళుకువ వచ్చింది సమీరకు.

"అప్పుడే వచ్చేశామా" అడిగింది సమీర.

"ఇప్పుడే క్రిందకి దిగటం మొదలుపెట్టాడు. ఇంకాసేపట్లో క్రింద వుంటాం" అన్నాడు అశోక్.

టైమ్ చూసుకుంది సమీర. "కరెక్ట్ టైముకే వస్తున్నాడు" అంది, తల మీద ఫాన్ గాలికి ఎగురుతున్న ముంగురులు సర్దుకుంటూ.

"నన్ను రిసీవ్ చేసుకోటానికి నా ఫ్రెండ్ వినీల్ ఘోష్ వస్తున్నాడు. మీకేదైనా సహాయం కావాలా?" అడిగాడు అశోక్.

“నన్ను రిసీవ్ చేసుకోవటానికి కూడా ఒకాయన వస్తున్నారు. అదేం ఫరవాలేదు. థాంక్స్ ఫర్ ఆస్కింగ్” అంది.

ఇద్దరూ దిగి, లగేజ్ తీసుకుని, బండి మీద పెట్టి త్రోసుకుంటూ బయటికి వచ్చారు.

“ఏయ్.. అశోక్ ఇక్కడ.. ఇక్కడ..” అంటూ పెద్దగా బెంగాలీలో అరుస్తూ వచ్చాడు వినీల్.

అశోక్ అతన్ని కావలించుకుని “ఎన్నాళ్ళో అయిందిరా నిన్ను చూసి” అన్నాడు.

సమీర వేపు తిరిగి, “వీడొచ్చేశాడుగా. ఇక నేను వెడతాను. మీ స్నేహితుడు వచ్చాడా?” అన్నాడు.

“వస్తున్నాడు, మీరు వెళ్ళండి” అని అతనికి బై చెప్పింది సమీర.

నిక్ ఎక్కడా కనపడలేదు.

మాటిమాటికీ గడియారం చూసుకుంటూ ఇటూ అటూ అసహనంగా తిరుగుతున్నది. తనలోతనే ఏదో అనుకుంటున్నానని పైకే అనేస్తున్నది.

అప్పుడే గుర్తుకువచ్చింది, తన దగ్గర అతని ఫోన్ నెంబరుందని.

ఫోన్ చేయబోతుండగా ఎదురుగా అట్ట మీద సమీర అని వ్రాసి పట్టుకుని, గబగబా తన వేపే చూస్తూ వస్తున్న ఆరడుగుల నిక్ కనపడ్డాడు సమీరకు.

నిక్ ఈమే సమీర అయింటుంది అనుకున్నాడు కాబోలు, చేయి వూపుతూ ఆమె వేపే వస్తున్నాడు.

సమీర కూడా చేయి వూపుతూ, అతని కేసి నడిచింది.

నిక్ ముందుకు వచ్చి “సమీర?” అన్నాడు.

“అవును. థాంక్స్ ఫర్ కమింగ్” అంది అతనికి షేక్ హాండ్ ఇస్తూ.

“నైస్ మీటింగ్ యు. బాబ్ మీరెలా వుంటారో వర్ణించి చెప్పాడు” అన్నాడు నిక్.

సమీర నవ్వి “అలాగే వున్నానా?” అంది.

తను కూడా నవ్వి, “వాడు చెప్పినదానికన్నా ఇంకా బాగున్నారు. సారీ నేనొచ్చిన బస్సు ఆలస్యంగా వచ్చింది” అన్నాడు నిక్.

“దట్స్ ఓకే” తలవూపింది సమీర, దానికన్నా ముందు బస్ తీసుకుని రావచ్చుగా అనుకుంటూ.

“నేనీవూళ్ళో వుంటున్నది కొద్ది వారాలే కనుక కారు కొనుక్కోలేదు. బస్సులో వచ్చాను. సామానుంది కదా టాక్సీలో వెడదాం” అని, సామాన్ల బండి తోసుకుంటూ టాక్సీలు వుండే చోటుకి దారితీశాడు.

అతనితో పాటు నడుస్తున్నది సమీర.

నిక్ సన్నగా, చిరునవ్వు ముఖంతో, రాగిరంగు గిరజాల జుట్టుతో హుందాగా వున్నాడు.

హాండ్సంగా బాగున్నాడు అనుకున్నది సమీర.

“ఇక్కడికి మా ఎపార్ట్మెంట్ దగ్గరేనా?” అంది.

“మరీ దగ్గరా కాదు, మరీ దూరమూ కాదు. బర్మింగ్హాం పెద్ద వూరే. మరీ చిన్నది కాదు” అన్నాడు నిక్.

ఇద్దరూ టాక్సీ ఎక్కి తన ఎపార్ట్మెంటుకి వెడుతున్నప్పుడు అడిగింది సమీర, “మీరు ఇక్కడ ఏం చేస్తుంటారు?” అని.

నిక్ పెద్దగా నవ్వాడు. “దటీజ్ ఎ గుడ్ క్వెశ్చన్. నాకే సరిగ్గా తెలీదు” అన్నాడు.

“అదేమిటి?” అన్నది సమీర కూడా నవ్వుతూ.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments